నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | ఫిబ్రవరి 17, 2024 | www.navatelangana.com

అమ్ధాపూర్ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ సహకార సంఘ అధ్యక్షుడు గిర్దావర్ గంగారెడ్డిపై అవిశ్వాస తీర్మానం చేయడానికి డైరెక్టర్లు జిల్లా సహకార సంఘ అధికారికి శుక్రవారం నోటీసు అందించారు. త్వరలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి వీలుగా తేదీని ఏర్పాటు చేయాలని సహకార శాఖ అధికారిని కోరారు. అవిశ్వాస తీర్మాన లేఖను పరిశీలించిన సహకార శాఖ అధికారి త్వరలో నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేస్తానని డైరెక్టర్లకు తెలిపారు.



నోటీసు అందజేస్తున్న డైరెక్టర్‌లు

ఇక్కట్లు లేకుండా సంతకు ఏర్పాట్లు

నవతెలంగాణ కథనం నేపథ్యంలో పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్‌లో సంత జరిగే ప్రాంతాన్ని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండి వార్ విజయ్, గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ప్రత్యేక అధికారుల పాలనలో మద్నూర్ సంతలో మార్పు వచ్చేనా అనే శీర్షికతో నవ తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మద్నూర్ మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే సంత రోడ్లపై నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంటుందని స్థానికులు తెలిపారు. గతంలో లాగా గాంధీ చౌక్ నలుమూలల్లో సంత కొనసాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు





ఏకమైన కార్మికులు

సార్వత్రిక సమ్మె సక్సెస్

- పెద్దఎత్తున ర్యాలీలతో మహాప్రదర్శన
- కార్పోరేట్, మతతత్వ విధానాల నుంచి దేశాన్ని కాపాడుకుంటాం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పి ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మికుల హక్కులు కాపాడుకుంటామని స్పష్టీకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ/ కామారెడ్డి

మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు ఏకమైయ్యారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కార్మికులు కదం తొక్కారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి మహాప్రదర్శన చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ - మతతత్వ విధానాలను ఎండగడుతూ దేశాన్ని కాపాడుకుంటామని నినాదాలు చేశారు. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మె సక్సెస్ అయింది. మార్కెట్ యార్డులు బోసిపోయాయి. రవాణ రంగ కార్మికులు పలువురు సమ్మెలో భాగంగా బంద్ పాటించారు. సమ్మెకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, వివిధ కార్మిక సంఘాల నాయకులు రాజీవ్ గాంధీ ఆడిటోరియం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ రోడ్డు మీదుగా ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీగా తరలి మహాప్రదర్శన చేపట్టారు.

ఈ సభకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల జిల్లా బాధ్యులు నూర్జహాన్, ఎం.సుధాకర్, వై.ఓమయ్య, సుధాకర్, శివకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా వచ్చిన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, ఏఐటీయూసీ జాతీయ నాయకులు ఐఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు జి.భూమయ్య మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదమైంది. మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలు పాటిస్తూ, కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుంది. కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్ లను వెంటనే రద్దు చేయాలి. రైతులకు ఇచ్చిన కనీస మద్దతు ధర, రైతు వ్యతరేక చట్టాలను శాశ్వతంగా రద్దు చేయడం వంటి హామీలను నెరవేర్చాలి. గత పది ఏండ్లుగా దేశంలో నిరుద్యోగిత రేటు పెరిగిందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ హామీగానే' మిగిలిపోయిందన్నారు.

కార్పోరేట్‌ల ఆదాయం 30 శాతం వృద్ధి.. ప్రజల ఆదాయం 11 శాతం కోత

మోడీ ప్రభుత్వ విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ట స్థాయికి చేరాయన్నారు. తద్వారా కార్పొరేట్ల ఆదాయం 30 శాతం వృద్ధి చెందగా, పేద మధ్యతరగతి ప్రజల ఆదాయం 11 శాతం పడిపోయిందన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలోనే ధరలు 30 శాతం నుండి 56 శాతం వరకు పెరిగాయన్నారు. పెట్రోలు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను 243 శాతానికి పెంచిందన్నారు. 2023లో కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్లు బ్యాంకు రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే వైఖరిని విడనాడాలన్నారు. మోడీ విధానాల వల్ల మధ్యతరగతి ప్రజల జీవితాలు అతుకుల బతుకులుగా మారాయన్నారు. ప్రస్తుతం దేశం మతతత్వ విద్వేష రాజకీయాలతో అట్టుడుకుతుందన్నారు. దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులు, రైతులపైనే ఉంద న్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సిపిఐ రాష్ట్ర నాయకులు కే.భూమయ్య, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, న్యూడెమోక్రసీ జిల్లా జిల్లా కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, ఏఐపి కేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, వివిధ కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు డి.రాజేశ్వర్, రాములు, నర్సింగరావు, భూపతి, సూరి రఘురాం, గణేష్, అషూర్, కిరణ్, విటల్, రవి, మహిపాల్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో కదం తొక్కిన కార్మికులు

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపుతో అంగన్‌వాడీ, ఆశ గ్రామపంచాయతీ, మున్సిపల్, మధ్యాహ్న భోజన, బీడీ, ట్రాన్స్‌పోర్ట్, తదితర రంగాల కార్మికులు కదం తొక్కారు. ఉదయం గంజ్ ప్రాంతం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. డప్పుల దరువులతో, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పట్టణ వీధులు మారుమ్రోగాయి. అనంతరం మున్సిపల్ కార్యాల యం వద్ద నిర్వహించిన బహిరంగ సభకు పెద్దఎత్తున కార్మికులు హాజరైయ్యారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్త నరసింహులు మాట్లాడారు. సెంట్రల్ లేబర్ కమిషన్ ప్రతి కార్మికునికి కనీస వేతనం 26,000 చెల్లించాలని చెప్పినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత పది సంవత్సరాల క్రితం 43 కార్మిక చట్టాలు ఉంటే బిజెపి ప్రభుత్వం కార్పొరేట్‌రంగ శక్తులతో కుమ్మక్కై వాటిని తొలగించి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికు లకు ఎలాంటి ప్రయోజనం లేకుండా చేసిందన్నారు. దేశభక్తి అంటూ దేశంలో ఉన్న కార్మికులకు న్యాయం చేయవలసింది పోయి 30 శాతం ఉన్న కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారికి ఊడిగం చేస్తుందన్నారు. ఇప్పటివరకు ప్రతి రంగాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టిన కేంద్రం.. మిగిలిన వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నం చేస్తుంటే నేడు రైతులు కాపాడుకోవడానికి ఢిల్లీలో ధర్నాలు చేయడానికి వెళుతుంటే కేంద్ర ప్రభుత్వం వారిపై దాడులు చేస్తుందన్నారు.

దేశభక్తి అంటే ఇదేనా..?

దేశభక్తి అంటే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఓడరేవులు రైల్వే ఎల్‌ఐసి తదితర రంగాలను కార్పోరేట్లకు అమ్ముకోవడం కాదని వాటిని అభివృద్ధి చేసి ప్రజలకు ఉద్యోగాలను కల్పించడమే దేశభక్తి అంటారని అన్నారు. ఎర్రజెండా పార్టీలు ఉంటే పేద ప్రజలు కార్మికుల పక్షాన ఉంటారని ఈ పార్టీలు లేకుండా చేయాలని ఉద్దేశంతో అనేక దాడులు చేస్తున్నారని, కార్మికులు కర్షకులు ఎర్రజెండా వైపు ఉన్నన్ని రోజులు ఎర్రజెండాను ఎవరేమి చేయలేరన్నారు. కార్మికుల కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోతీరాం నాయక్, పిడుగు నరసింహులు, గిరిజన సంఘం నాయకులు ప్రకాష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, అంగన్వాడి నాయకులు బాబాయి, కల్పన, ఆశ నాయకురాలు రాజశ్రీ, గ్రామపంచాయతీ నాయకుడు బాలనర్సు, మున్సిపల్ నాయకులు రాజనర్సు, మహబూబ్, మధ్యాహ్నం భోజనం నాయకులు సరస్వతి, బీడీ కార్మిక నాయకుల సత్యం, ట్రాన్స్పోర్ట్ నాయకులు కళాల్, సురేష్, నయం, వివిధ రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.



కార్మికుల సమ్మెతో నిర్మానుష్యంగా మారిన గంజ్





నిజామాబాద్, కామారెడ్డిలో నిర్వహించిన సభలకు పెద్దఎత్తున హాజరైన కార్మికులు

పెన్షనర్‌ల పట్ల కేంద్రం విధానాలు మారాలి

కంఠేశ్వర్ : పెన్షనర్ల పట్ల ప్రభుత్వ విధానాలు మారాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇపిస్ పెన్షనర్లకు నెలకు 9000 రూపాయలు పెన్షన్ చెల్లించాలని, పెన్షనర్లకు ఇన్కమ్ టాక్స్ పరిధి నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజాబాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కమిటెడ్ వ్యాల్యూ ఆఫ్ పెన్షన్ను(సీ.వి.పి) 15 సంవత్సరాల నుండి 13 సంవత్సరాలకు కుదించాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరసనలో జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు, కార్యదర్శి ఎస్ మదన్ మోహన్ డివిజన్ అధ్యక్షులు సిర్ప హనుమాన్లు, కార్యదర్శి అందేసాయిలు,జిల్లా నాయకులు భోజారావు లావు వీరయ్య, రాధాకృష్ణ , బట్టి గంగాధర్, లక్ష్మీనారాయణ , పూర్ణచంద్రరావు, శిర్ప లింగయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్

మహిళలకు, బాలలకు 'భరోసా'తో సాయం

- సెంటర్‌ను ప్రారంభించిన ఎస్పీ సింధు శర్మ



భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

బాధిత మహిళలు, బాలలు అధైర్య పడకుండా వారిలో ఆత్మసైర్యాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవడములో బాగముగానే రాష్ట్ర వ్యాప్తంగా భరోసా సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. శుక్రవారం కామారెడ్డి జిల్లాకేంద్రలో భరోసా సెంటర్‌ను ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా భరోసా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపములో గల గ్రీన్ హోమ్ కాలని యందు గల భవనంలో ఏర్పాటు చేసిఏనట్టు తెలిపారు. బాధిత మహిళలకు, బాలలకు ఈ కేంద్రం నుండి అన్ని రకములుగా 24/7 సహాయకారిగా ఉంటుందని తెలిపారు. భరోసా సెంటర్స్ లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, బాలలకు ఆసుపత్రులు, పోలీసు స్టేషన్ లకు దూరముగా ఒక మంచి వాతావరణములో వైద్య, న్యాయ సలహా, కౌన్సిలింగ్ వంటి అన్ని సౌకర్యాలు ఒకే గొడుగు కింద అందించడం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీవింగ్ పర్యవేక్షణలో షీ టీమ్స్, భరోసా కేంద్రాలు విజయవంతంగా పనిచేస్తున్నాయి.

విద్యారంగాన్ని కార్పోరేట్‌లకు కట్టబెట్టే కుట్ర

- అందుకే నూతన విద్యావిధానంతో కాషాయీకరణ
- కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేసిన విద్యార్థి సంఘాలు



నిజామాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు..



కామారెడ్డిలో విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి కుట్రలు పన్నుతుంది. చంద్రయాన్ ద్వారా జాబిల్లి వరకు చేరుకుంటున్నా.. చదువులలో విద్య కాషాయీకరణ చేస్తూ చరిత్రను వక్రీకరిస్తుందని' విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలియజేస్తూ నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాడ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. అదే విధంగా కామారెడ్డిలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ మారుస్తూ, విద్యారంగంలో మూఢత్వాన్ని జొప్పిజోపిస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాల్సింది పోయి గ్రాండ్స్ కమిషన్‌కు నిధులను తగ్గించి నిర్వీర్యం చేసే కుట్రకు తెరలేపినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్‌లలో కోతను విరమించుకోవాలన్నారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించక పోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న శాస్త్రీయ విద్య వ్యతిరేకత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల అజాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రాచకొండ. విఘ్నేష్, బోడ.అనిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, డాక్టర్ కర్క. గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కే. అషర్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐఎఫ్‌డీ జాతీయ కన్వీనర్ రాజశేఖర్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు తిరుమలేశ్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి నవీన్ , ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, నాయకులు డి.దీపిక,నవీన్, ప్రశాంత్ , భూషణ్,సాయి, శివాజి, రమేష్, సుధాకర్, గణేష్, సందీప్,చత్రుసింఘ్, నవీన్ పాల్గొన్నారు.

జాప్యానికి తావులేకుండా సకాలంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువు లోపు చార్జ్ షీట్ దాఖలు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల దర్యాప్తు పురోగతిపై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పోలీస్ డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు జరిపి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో న్యాయస్థానంలో చార్జ్ షీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వం తరపున అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. పోలీస్ శాఖ ద్వారా అందించాల్సిన నివేదికలను సత్వరమే పంపించాలని, తద్వారా మిగతా వారికి కూడా ఎక్స్‌గ్రేషియా అందించే ఏర్పాటు చేస్తామని జిల్లా పోలీసు కార్యాలయ అధికారులకు సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి శశికళ, ఆర్మూర్ ఆర్డీఓ వినోద్ కుమార్, డీటీడబ్ల్యూఓ నాగూరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విప్లవాత్మక గ్రామీణ ఆవిష్కరణల ప్రదర్శన

- నేడు 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ఎగ్జిబిషన్' ప్రదర్శన
- రైతులు వినియోగించుకోవాలి : ఈడీఎం కార్తిక్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసి), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) సంస్థలు సంయుక్తంగా 'వన్ డిస్ట్రిక్ట్ - వన్ ఎగ్జిబిషన్' పేరిట నేడు(శనివారం) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన గ్రామీణ ఆవిష్కరణలు ప్రదర్శించడానికి ఈ కార్యక్రమం చక్కటి వేదికగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు, మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న, తక్కువ-ధర ఆవిష్కరణలను ప్రదర్శించడానికి 30 మంది పల్లె సృజన, ఆవిష్కర్తలను ఒకచోట చేర్చి, టీఎస్ఐసిచే నిశితంగా పరిశీలించిన మీదట ఈ కార్యక్రమంలో నూతన ఆవిష్కరణలను ప్రదర్శనకు ఎంపిక చేసినట్టు తెలిపారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో రైతులు, వాటాదారుల ప్రయోజనం కోసం వారి విస్తరణను సులభతరం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఎగ్జిబిషన్‌కు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు), స్వయం సహాయక బృందాలు, స్థానికులు హాజరు కావాలని కోరారు.

నవతెలంగాణ

2

నిజామాబాద్

శనివారం | ఫిబ్రవరి 17, 2024 | www.navatelangana.com

ఏర్గట్ల ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల నూతన ఎంపీడీఓ గా ఎం. వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఈయన గతంలో నిర్మల్ జిల్లా కడెం మండలంలో విధులు నిర్వర్తించారు. కాగా గత కొన్ని సంవత్సరాలుగా ఏర్గట్లలో పనిచేసిన ఎంపీడీఓ రాజేశం కామారెడ్డి జిల్లా రాజాంపేటకు బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్లకు ఉద్యోగులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



బాధ్యతులు చేపతుడుతున్న ఎంపీడీవో

ఈవీఎంల పనితీరు పరిశీలనకు మాక్‌పోల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియలో భాగంగా శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి మాక్ పోల్ ప్రక్రియను పరిశీలించారు. ప్రాథమిక పరిశీలన ద్వారా పనితీరు సక్రమంగా ఉన్నట్లు గుర్తించిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి.ప్యాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ చేపట్టి ఈవీఎంలను ప్రయోగాత్మకంగా పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా మాక్‌పోల్ ప్రక్రియపై, ఈవీఎంల పనితీరు గురించి కలెక్టర్ వివరిస్తూ, రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సెక్యులర్ భావనలే దేశానికి రక్ష

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రపంచంలోనే అతి పెద్ద భారత రాజ్యాంగమని, ఇందులోని పీఠిక "భారత ప్రజలమైన మేము" అని మొదలవుతుందని సర్వసత్తాక సోషలిస్టు, సెక్యులర్ ప్రజాస్వామ్య రిపబ్లిక్ అని, దీనిని కాపాడు కోవలకున అవసరం అందరి మీద ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు అన్నారు. శుక్రవారం డిచ్ పల్లి మండలం లోని ధర్మారం బి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నుద్దేశించి అయన మాట్లాడారు. మనుధర్మం కన్న మానవ ధర్మాన్ని తెలిపే రాజాంగం గొప్పదని, మత రాజ్యలుగా ఉన్న పాకిస్తాన్, అఫ్ఘానిస్థాన్‌లు అధోగతి పాలయ్యాయని, మన దేశాన్ని కూడ మత రాజ్యంగా మార్చాలని కుట్ర జరుగుతుందని వివరించారు. దీనిని తిప్పి కొట్టాలని సూచించారు. కార్యక్రమంలో బర్దిపూర్ సహకార సొసైటీ చైర్మన్ కొసరాజు రామకృష్ణ, తలారి సామన్న, కన్వీనర్ మండల జన విజ్ఞాన వేదిక, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు ఘన సన్మానం

నవతెలంగాణ-బాల్కొండ

నిర్మల్ జిల్లా నుండి ఇటీవల బదిలీపై వచ్చి బాల్కొండ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన విజయభాస్కర్ రెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ జావిద్ అలీ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాల్కొండ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న నాయకులు

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఎంపీడీవో సంతోష్ కుమార్



మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్

గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు శుక్రవారం మండలంలోని పెద్దమ్మ కాడి తండా సికింద్రా పూర్, గోన్ గొప్పల గ్రామపంచాయతీలను ఎంపీఓ గంగ మోహన్ ఏపీఓ నర్సయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి పై సమీక్ష నిర్వహించారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నర్సరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గోనుగోప్పుల గ్రామంలో ఎంపీడీవో సంతోష్ కుమార్‌ను టిఆర్ఎస్ నాయకుడు చారి సన్మానించారు.

ఎంపిడిఓను సన్మానించిన కారోబార్లు



ఎంపీడీవోను సన్మానిస్తున్న కారోబార్లు

నవతెలంగాణ-నిజామాబాద్(మెండోర)


మెండోర మండల నూతన ఎంపిడిఓ వనజను మండల కారోబార్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నయ్య మండల అధ్యక్షుడు కృష్ణ, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ , సెక్రెటరీ లు చిరంజీవి , రాజేందర్ , గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం మరువలేనిది...

- మాజీ సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ లోలం సత్యనారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేసిన సన్మానాలు మరువలేనివని ఇందల్ వాయి మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ లోలం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గ్రామ మహిళా సంఘాల అధ్యక్షురాలు, మహిళలు కలిసి తాజా మాజీ సర్పంచ్ లోలం సత్యనారాయణ ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు వస్తుంటాయి పోతుంటాయి కాని పదవులలో ఉన్నప్పుడు వారి సాదక బాదకాల్లో పాల్గొనడమే కాకుండా వారి అవసరాలు మేరకు చేదోడు వాదోడుగా ఉంటూ సంఘాల, మహిళల, గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశామని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా మీ సంఘాలకు నా వంతు సహాయకారాలు ఎల్లప్పుడు కొనసాగిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఐకెపి సీసీ గోవింద్, వీవోఏ మౌనిక, గ్రామ సంఘాల అధ్యక్షురాలు కవిత, ఉపాధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి సుజాత, సహాయ కార్యదర్శి చంద్రకళ, కోశాధికారి మమత, మహిళా సంఘాల సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



లోలం సత్యనారాయణను సన్మానిస్తున్న మహిళాసంఘాల సభ్యులు

దర్జాగా బెల్టు దందా

- గ్రామాల్లో పుట్టగొడుగుల్లా దుకాణాలు
- ప్రతి పల్లెలో అర్ధరాత్రి వరకు విక్రయాలు
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

నవతెలంగాణ-మాక్లూర్

పట్టణాల్లో అనుమతులతో మద్యం షాపులు కొనసాగిస్తున్నా, పల్లెల్లో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే బెల్టుషాపుల నిర్వాహకులు యథేచ్ఛగా దందాను కొనసాగిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలను చేపడుతున్నారు. మాక్లూర్ మండలంలో మానిక్ బండార్, మాక్లూర్ గ్రామ శివారులో వైన్‌షాపులు ఉన్నాయి. వీటి నుంచి ప్రతిరోజూ ఆటోలో, కారుల్లో మద్యాన్ని బెల్ట్ షాప్‌లకు తరలిస్తున్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్వహణ ఇష్టారీతిన కొనసాగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, తండాల్లో బెల్టుషాపు దుకాణాలు కొనసాగుతున్న అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఒకవైపు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరోవైపు బెల్టు దుకాణాలు పల్లె ప్రజలను మత్తులో ముంచెత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా బెల్టు దుకాణాలు కొనసాగుతున్న చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.



వైన్స్ షాప్ నుంచి బెల్ట్ షాపులకు ఆటోలో తరలిస్తున్న మద్యం

గతేడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చింది. జిల్లాలో ప్రభుత్వం నుంచి ఇచ్చిన అనుమతులతో మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ సారి ఎన్నికల పోరు వల్ల మద్యం వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడి బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు.

బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న మద్యం వ్యాపారులు

మద్యం వ్యాపారులు పలువురు పలుకుబడి ఉన్నవారు సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఇటీవల గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణకు మాత్రం అడ్డు అదుపు లేకుండా పోయిందని విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మద్యం వ్యాపారులు బెల్టుషాపులను ప్రోత్సహించేందుకు ఆటోలో, కారులో గ్రామాలకు మద్యం తరలిస్తున్నారు. అధికారులు స్పందించి బెల్టు షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఎనిమిది బెల్టు షాపులు..

ఓవైపు బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే, మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చి సంవత్సరం అవుతోంది. గ్రామాల్లో బెల్టు దుకాణాలు జోరందుకున్నాయి. ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఎనిమిది వరకు బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. గ్రామం ఆధారంగా బెల్టుషాపులు సంఖ్య ఉంటుంది. చిన్న గ్రామం అయితే రెండు నుంచి నాలుగు వరకు, పెద్ద గ్రామం అయితే 8 వరకు కొనసాగుతున్నాయి. అర్ధరాత్రి వరకు మద్యం లభిస్తుంది.

ఎంఆర్‌పి కంటే రూ.10 నుంచి రూ. 40 వరకు ఎక్కువ

నూతన మద్యం విధానంలో కరోనా కాలంలో మద్యం రేట్లను ప్రభుత్వం ఎమ్మార్పీ రేట్లు చేశాయి. ఎమ్మార్పీ రేట్ల కంటే ఎక్కువగా రూ.10 నుంచి రూ. 30 వరకు గ్రామాల్లో అమ్ముతున్నారు. మద్యం అనుమతి ఉన్న దుకాణానికి వెళ్లి రావడానికి అయ్యే ఖర్చు కంటే గ్రామాల్లోనే కొనుగోలు చేయడం మంచిదనే అభిప్రాయంతో మద్యం ప్రియులు ఉండడంతో బెల్టు దుకాణాలకు తిరిగే లేకుండా పోయింది. బెల్టు దుకాణాలు నిరోధించాల్సిన అధికారులు చోద్యం చూస్తూ ఉండడంతో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

గ్రామాల్లో అక్రమంగా బెల్టుషాపులను నిర్వాహకులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో జోరుగా సాగుతున్న ఈ బెల్టు షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మద్యానికి బానిస కావడంతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బెల్టుషాపులను అధికారులు నియంత్రించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

న్యాయ సంబంధ విషయాలపై అవగాహన ఉండాలి

- జిల్లా జడ్జి పద్మావతి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో రైతు వేదికలో జిల్లా న్యాయ సేవ సమితి ఆధ్వర్యంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ఆన్ ట్రైబల్ రైట్స్ పైన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జడ్జి పి.పద్మావతి మాట్లాడుతూ న్యాయ సంబంధమైన విషయాల పైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉదాహరణకు డబ్బులు ఇచ్చి పుచ్చుకునే విషయంలో ప్రామిసరీ నోటు పైన రాసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒక ప్రామిసరీ నోటు మూడు సంవత్సరాల కాలం పాటు చెల్లుబాటు అవుతుందని తెలిపారు. విత్తనాలు కొన్న రసీదును జాగ్రత్త ఉంచుకోవాలని, విత్తనాలు సరిగా మొలకెత్తిని పక్షంలో విత్తనాల రసీదుతో వినియోగదారుల ఫోరంకు ఒక ఫామ్ తో సబ్మిట్ చేస్తే వినియోదారుల ఫోరం వారికి న్యాయం చేసి సంబంధిత కంపెనీ నుండి నష్టపరిహారం ఇప్పించగలుగుతుందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన బలహీనవర్గాలు, అసహాయులకు న్యాయం పొందేందుకు ఎవరైనా లాయర్ పెట్టుకొని స్తోమత లేనివారికి న్యాయ సాయం పొందేందుకు జిల్లా న్యాయ సేవ సమితి ముందుంటుందని తెలిపారు. వారికి ఒక లాయర్ని నియమించి కేసునువాదించే విధంగా చూసుకుంటుందని చెప్పారు. ఎప్పుడైనా.. ఎవరైనా బాధితులు పోలీస్ కేసు పెట్టినప్పుడు కేస్ ఫైల్ చేయని పక్షంలో ప్రైవేట్ కేసు కూడా పెట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగిన కేసుల్లో సత్వర న్యాయం జరుగుతుందని, కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్లు రవీందర్ సుబేదార్, రామారావు, ఆసన్న నారాయణరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్, ఎస్సై గంగాధర్, వీడిసి అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు.



జడ్జీని పద్మావతిని సన్మానిస్తున్న పలువురు

బాధిత కుటుంబానికి అండగా

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతం గోదావరి నదిలో మండల కేంద్రానికి చెందిన అనికేశి రమేష్ వృత్తి రీత్యా చేపలు పట్టే క్రమంలో రోజు వారిగా గోదావరి నదిలోకి వెళ్లి గల్లయింతై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మృతుడు రమేష్ గతంలో కత్తర్ దేశంకు ఉపాధి కోసం వెళ్లారు. విషయం తెలుసుకున్న అక్కడి స్నేహితులు శుక్రవారం రోజు రమేష్ కుటుంబానికి అండగా రూ.15 వేల రూపాయలను ఆర్థిక సాయం కింద అందజేశారు. కార్యక్రమంలో మృతుడి స్నేహితులు అబ్బగోని ఆనంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, భూమేష్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆశ్రమ వజ్రోత్సవాలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి గీత భక్తజన ఆశ్రమ వజ్రోత్సవములు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మహర్షి ఆశ్రమాల పీఠాధిపతులు ఆచార్య శ్రీహరి తీర్థ స్వామి ఓంకార జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కమలానంద భారతి స్వామి జ్యోతి ప్రజ్వలన చేశారు. వజ్రోత్సవాల ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు, సత్యానంద మహర్షి వారి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. సభ కార్యక్రమంలో దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన మహాత్ములు, పీఠాధిపతులు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జగదాంబ ఆలయంలో యజ్ఞం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని లక్ష్మి జగదంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా మహాయజ్ఞం,కుంకుమ అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అయ్యవార్ల రమణ చారి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కొమ్ముల రజినీకాంత్, కార్యదర్శి కుందారం శ్రావణ్, ఉపాధ్యక్షులు రాజుల చిన్న బాబయ్య, క్యాషియర్ రాధారపు నర్సయ్య, రైటర్ పెద్ది ధన్‌రాజ్, ఖాతాదారు కొమ్రే అంజి, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, మహిళలు పాల్గొన్నారు

నియోజకవర్గ సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో మొట్ట మొదటి సారిగా మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయని, హాస్టల్‌లో ఒకే గదిలో30నుండి 40మంది వరకు ఉంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కొడంగల్‌లో మోడల్ హాస్టల్ నిర్మాణాలు చేస్తున్నట్లు ఇక్కడ కూడా చేయాలని, 100పడకల ఆసుపత్రి పేరుకు మాత్రమే ఉంది డాక్టర్లు, నర్సులు వైద్య పరికరాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైద్య శాఖ మంత్రి కి పలుమార్లు తెలియజేసిన ఇప్పటి వరకు పరిస్థితి మారలేదని తెలిపారు. పరిశ్రమలు లేక యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, ఆర్మూర్ నియోజకవర్గంలో లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చిక్లి, గుంజ్లి, కంఠం గ్రామాల్లో ప్రారంభించి రైతులకు నీరు అందించాలని కోరారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ పాటించకపోవడం ప్రభుత్వానికి మంచిది కాదని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన రమ్య

- తల్లిదండ్రుల కోరిక నెరవేర్చిన పేదింటి అమ్మాయి

నవతెలంగాణ-ముప్కాల్

అమ్మాయిది నిరుపేద కుటుంబం, అమ్మాయి తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఎంతో దోహదపడ్డారు. తల్లి ఒకవైపు బీడీలు చుడుతూ, మరోవైపు తండ్రి ఒక ప్రయివేటు పాఠశాల బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ వారు కలలు కన్న దాన్ని వారి పెద్దమ్మాయి రమ్య ద్వారా వారి కలలను సాకారం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన రెంజర్ల గంగాధర్, లక్ష్మీ దంపతులకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దమ్మాయి రమ్య ఒకటవ తరగతి నుంచి 7వ తరగతి వరకు మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో విద్యను అభ్యసించింది. 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముప్కాల్ లో చదివింది. 9.5 గ్రేడ్‌తో బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్ లో పీజీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించేలా అమ్మాయి రమ్య కష్టపడి ఉన్నత చదువులు చదివింది. ప్రభుత్వ గురుకుల ఫలితాలు వెలువడిన వేళ టిజిటి స్కూల్ అసిస్టెంట్ లైబ్రరీయన్ ఉద్యోగం సాధించింది. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రమ్య ఉద్యోగ నియామక పత్రం అందుకుంది. ప్రభుత్వ గురుకుల ఉద్యోగం సాధించిన అమ్మాయి రమ్యతోపాటు రమ్య తల్లిదండ్రులను ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



క్రీడా దుస్తుల వితరణ


నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 18, 19 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరగబోయే 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల, పురుషుల హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనబోయే జిల్లా హ్యాండ్ బాల్ మెన్ అండ్ ఉమెన్ జట్లకు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షులు గంగమోహన్ చక్రు క్రీడాకారులకు శుక్రవారం క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ఉంటూ,క్రీడలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి నిజాంబాద్ జిల్లా జట్టుకు పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పింజా సురేందర్ కోశాధికారి గట్టిడి రాజేష్ ,విఠోబ శేఖర్, పిఈటిలు అంజు, అనూష, సంజీవ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక ప్రోత్సాహం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్థిక ప్రోత్సాహం అందించారు. ఈ నెల 17,18,19 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు దివ్య కృష్ణశ్రీ పాల్గొననున్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ తరుపున ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అవారి శ్రీనివాస్, సుంకరి విజయ్, మారుపక నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు దేవన్న, కిషన్, మాధురి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న వీడీసీ సభ్యులు

ఎన్‌వైకే ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

యువ కేంద్ర జాతీయ యువజన పార్లమెంటు ఉత్సవాల్లో భాగంగా జాతీయ స్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహిస్తోందని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల యువజన అధికారిని నెహ్రూ యువ కేంద్ర శైలి బెల్లాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను జిల్లాల వారిగా విభజించి అందులో సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల కేంద్రాలకు కలిపి నెహ్రూ యువ కేంద్ర నిజామాబాద్ ఆన్లైన్ ద్వారా ఈ పోటీలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతి జిల్లా నుండి ఇద్దరు విజేతలు రాష్ట్రస్థాయిలో గెలిచినవారు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రెండు లక్షల నగదు, రెండో బహుమతి లక్షా50వేలు, మూడో బహుమతి లక్ష రూపాయలు, ప్రోత్సాహక బహుమతులు ఇద్దరికీ 50 వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒకటి ఫిబ్రవరి 2024 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలని పేర్కొన్నారు. మై యువ భారత్ అనే కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఉపన్యాస అంశాలు భారత్ ను ప్రపంచ స్థాయి నాయకత్వ దేశంగా నిలబెట్టడంలో యువత పాత్ర, మన దేశ ఆర్థిక స్థితిగతులలో రావాల్సిన మార్పులు, ఆత్మ నిర్భర్ భారత్ నుంచి వికసిత భారతం వైపు మన దేశ ప్రయాణంలో యువత పాత్ర, ఈ దేశ యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతూ స్వయం శక్తి కేంద్రాలుగా నిలపటంలో యువత పాత్ర పై ఉపన్యాసం ఇవ్వాలని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే అభ్యర్థులు హిందీ లేదా ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడాలని తెలిపారు. సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్, నారాయణపేట్, నగర్కర్నూల్, వనపర్తి, గద్వాల్ జిల్లాల అభ్యర్థులు 19న సాయంత్రం ఐదు గంటల లోపు ఈ కింద ఇవ్వబడిన లింక్ www.mybharat.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పోటీలు 20న ఉదయం 11 గంటలకు ఆన్లైన్ ద్వారా నిర్వహించ బడతాయని, ఇతర వివరాలకు జిల్లా యువజన అధికారిని నెహ్రూ యువ కేంద్రం 9100435410 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నవతెలంగాణ
కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 17, 2024 | www.navatelangana.com

మండల విద్యాశాఖ అధికారిగా గణేష్‌రావు



ఎంఈవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండల విద్యాశాఖ అధికారిగా గణేష్‌రావు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పిఆర్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు తాళ్ల సోమలింగం గౌడ్, సాయి రెడ్డి లు కప్పి పూలమాలలతో స్వాగతించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఉపాధ్యాయులు ఆంజనేయులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజేందర్‌సింగ్, రహమాన్, కిషోర్ కుమార్, పిఆర్‌టియు అసోసియేట్ మండలాధ్యక్షులు ఫుల్ అజీమ్ తాహిర్, మండల కార్యదర్శి గోవర్ధన్, గంగారాం, కరీం, గంగాధర్, మండల విద్యా వనరుల శాఖ సిబ్బంది ఛాయా, గంగాధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, జొన్న పంటలు పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పోతంగల్ ఖుర్దు గ్రామ పరిధిలోని మొక్కజొన్న, జొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి నరేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నరేష్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు ఉన్నట్లు గమనించినట్టు తెలిపారు. వీటి నివారణ కోసం రైతులకు పలు సూచనలు చేసినట్టు వివరించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి మంచి ఫలితాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఏఈఓ షోయబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య ఉండొద్దు

- అందుకు తగిన చర్యలు చేపట్టండి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్
- అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-జుక్కల్/పిట్లం/మద్నూర్

రాబోయే ఎండకాలంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎక్కడా నీటి కొరత సమస్యలు లేకుండా ముందస్తుగా సమస్యలను గుర్తించి చర్యలు వెంటనే చేపట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ, తాగునీటి పారుదలశాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుముల జుక్కల్ నియోజకవర్గం వెనుకబడి పోయిందనే ఉద్దేశ్యంతో సమస్యలు పరిష్కరించేందుకు అందరి సహకారంతో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి రావాలని, వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావ్ తెలిపారు. సమస్యలపైన ప్రజలు దరఖాస్తులను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజల వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్ : అధికారులతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



పిట్లం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిల్లర్గి గ్రామస్తులకు రుణపడి ఉంటా..

పిట్లం :చిల్లర్గి గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని చిల్లర్గి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన గెలుపునకు చిల్లర్గి గ్రామప్రజలు బ్రహ్మరథం పట్టడంతో తాను ఎమ్మెల్యేనయ్యానని కొనియాడారు. అందుకుగాను ప్రతి కార్యకర్తకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నియోజకవర్గ ఎలాంటి అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెనువెంటనే రెండు గ్యారెంటీలు అమలు చేశామని, వారం రోజులలో 500లకు గ్యాస్ సిలిండర్, 100 నుంచి 200ల యూనిట్లలోపు గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. చిల్లర్గిలో ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జంబిగే హన్మండ్లు, అడ్వకేట్ రామ్‌రెడ్డి, బొడ్డ రాజు, మోహన్‌రెడ్డి, మారెడ్డి కృష్ణారెడ్డి దొర, మురళీధర్‌గౌడ్, సూరత్‌రెడ్డి, మరగల దయానంద్, చిప్ప శివ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు కలిసిన మండల నాయకులు..

మద్నూర్ :జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావును మద్నూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి కలిశారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సచిన్, దరాస్ సాయిలు, వట్నాల రమేష్, కొండ గంగాధర్, బాలు యాదవ్, బండి గోపి, కర్ల సాయిలు పాల్గొన్నారు.

కళ్యాపూర్‌లో వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో రథసప్తమిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతియేటా రథసప్తమి నాడు ఈ వేడుకను ఆనవాయితీగా జరుపుతున్నట్టు ఆలయ పూజారి లింగం పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీతోపాటు, గ్రామ పెద్దల సమక్షంలో ఈ వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవ అనంతరం గ్రామంలోని ప్రతి కుటుంబంతో పాటు సమీపంలో ఉన్న కూనేపల్లి దూపల్లి, దండిగుట్ట, బాగేపల్లి గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి ఈ కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం వారికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గాండ్ల నాగరాజ్, కిన్నెర మోహన్, గంగోని శంకర్, బాలయ్య, ప్రవీణ్, పోతన్న, గ్రామపెద్దలు మైనిమోహన్, బోర్గం జలయ, వోడెక్క మోహన్, కాశం సాయిలు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాంప్లెక్స్ ఎరువులు అడుగు మందుగా మాత్రమే వాడాలి : ఏడీఏ రత్నం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రత్నం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వరిలో కాంప్లెక్స్ ఎరువులు అడుగుమందుగా మాత్రమే వాడాలని ఏడిఏ జీవరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లె తండాలో ఆమె వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాలు వివరించారు. రైతులు వరిలో కాంప్లెక్స్ ఎరువులను అడుగు మందుగా మాత్రమే వాడాలని ఆమె అన్నారు. కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడితే సల్ఫర్ పోషకం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడటం వల్ల భూమి లోపల సల్ఫర్ దుష్ప్రభావం ఏర్పడుతుందని అన్నారు. అడుగుమందుగా డీఏపీ ఎరువును వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా యూరియా వాడడం వల్ల చీడపీడలు, అగ్గితెగులు రావడానికి దారితీస్తుందన్నారు. చివరి యూరియా వాడేటప్పుడు పొటాష్ ఎరువును ఎకరానికి 10 నుంచి 15 కిలోలు కలిపి వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏవో విజయ్ శేఖర్, దివ్య గ్రామ రైతులున్నారు.

హనుమాన్ ఆలయానికి విరాళాలు



ఆలయానికి విరాళం అందజేస్తున్న దాత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలను అందజేశారు. ఇటీవల ఈ గ్రామంలో గ్రామ పెద్దల సహాయ సహకారాలతో శ్రీరామ మందిర నిర్మాణం చేపట్టగా, ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.5లక్షల 55వేల ఐదు వందల యాభై ఐదు రూపాయల నగదును ఆలయ కమిటీకి ఆయన అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సాయగౌడ్, గోపాల్‌కు ఆయన ఆ డబ్బులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్, ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ పాముల సాయిలు, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆటో సాయిల్, లోకేష్‌గౌడ్, రంజిత్‌గౌడ్, క్షేత్ర సహాయకులు గోపి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

- ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై కళాజాత ప్రదర్శన

నవతెలంగాణ-లింగంపేట్

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని పలువురు సూచించారు. మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి, లింగంపేట్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద శుక్రవారం జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కళాజాత బృందం సభ్యులు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందం ఆటపాటలతో గ్రామీణ ప్రాంత వాసులకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శన నిర్వహించారు. అలాగే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని వారు సూచించారు. ఎయిడ్స్ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. మత్తు పదార్థాలు మద్యం, గంజాయి లాంటి వాటికి అలవాటు పడి విలువైన జీవితాలను కోల్పోవద్దని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిపట్ల వివక్షత చూపవద్దని, ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు శ్రీనివాస్, సుజాత, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామాగ్రిని ఉపాధ్యాయుడు సునీల్ తన తండ్రి హరికిషన్‌రావ్, హన్మంత్‌రావ్ పాటిల్ జ్ఞాపకార్థం శక్తినగర్ ఎంపీపీఎస్ విద్యార్థులకు అందజేశారు. పాఠశాల అవరణలో హెచ్ఎం విఠల్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఖండేభల్లూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు సునీల్ మాట్లాడుతూ.. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, కంపాక్స్ బాక్స్, పలకలు, పంపిణి చేసినట్టు వివరించారు. ప్రతి సంవత్సరంలో భాగంగా ఈ ఏడు కూడా మహరాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల సరిహద్దు మారుముల గ్రామం శక్తినగర్ ప్రభుత్వ ఎంపీపీఎస్ విద్యార్థులకు అందజేశామవి తెలిపారు. తండ్రి జ్ఞాపకార్థం తనలక్ష్యం కోరకు ఉచితంగా పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో శక్తినగర్ ఎంపీపీఎస్ హెచ్ఎం విఠల్, సునీల్, ఎస్జీటీ ఖండేభల్లూర్ స్కూల్ ఉపాధ్యాయుడు సునీల్, అంగన్‌వాడీ టీచర్ కంసవ్వ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు అందజేత

భవిత కేంద్రంలో ప్రత్యేక విద్యతోపాటు వ్యాయామ పరీక్షలు



విద్యార్థులకు వ్యాయామ పరీక్షలు చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని భవిత దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలల్లో పరిసర గ్రామాల దివ్యాంగులైన నరాల బలహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రతి వారం వ్యాయామ పరీక్షలు నిర్వహిస్తామని ప్రత్యేక ఉపాధ్యాయులు పెంటయ్య, సాయన్న తెలిపారు. క్యాంపులో మొత్తం ఎనిమిది మంది వికలాంగులు హాజరయ్యారు. ఇందులో భాగంగా డాక్టర్ సారిక వ్యాయామం చేశారు. దివ్యాంగులకు తల్లిదండ్రులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయించాలని డాక్టర్ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో హనుమాన్ మందిరం నుంచి మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయంగా (ఎన్ఆర్ఈజీఎస్) నిధుల నుంచి విడుదల చేసిన 5 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జంబిగే హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు మరగల దయానంద్, స్పెషల్ ఆఫీసర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ మహేష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పలువురు

కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం కామారెడ్డికి వచ్చిన ప్రభుత్వ సలహాదారులు, టీపీసీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ షబ్బీర్ అలీ సమక్షంలో గడ్డం చంద్ర శేఖర్‌రెడ్డి, 16 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ చాట్ల వంశీ, జూలూరి సుధాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో సబ్బురి హరి కృష్ణ, తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్య వేదిక ఉపాధ్యక్షులు, కామారెడ్డి పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంచముఖి హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్ జొర్రిగల నర్సయ్య, తెలంగాణ రాష్ట్ర బి.సి సంఘం కామారెడ్డి టౌన్ అధ్యక్షులు, కొత్త దేవుని పల్లి పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మాదిగ తెలంగాణ చేనేత ఐక్య వేదిక డైరెక్టర్ మామిడాల వెంకటస్వామి, తెలంగాణ చేనేత ఐక్య వేదిక డైరెక్టర్, కామారెడ్డి టౌన్ పద్మశాలి మాజీ సహాయ కార్యదర్శి పాగాల రాజయ్య, కామారెడ్డి టౌన్ పద్మశాలి మాజీ సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

ధర్మారెడ్డిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ సుజన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా 72 మందికి పరీక్షలు నిర్వహించగా 13 మందికి మోతిబిందు ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. అదేవిధంగా 18 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి వారికి కంటి అద్దాలు సిఫారసు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు హరి కిషన్‌తో పాటు సూపర్వైజర్ శాంతి శ్రీ, వైద్య సిబ్బంది సంధ్య, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత తెలుగు మీడియం పాఠశాలలో సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 6 నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పౌష్టికాహారం, సమతుల్య ఆహారం తీసుకుంటే శారీరక ఎదుగుదల చక్కగా ఉంటుందని వివరించారు. సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ వినోద్, ఏఎన్ఎం అనురాధ, ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు నిర్మల, చంద్రకళ, ఫరీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి

మహిళలకు రుణాలు అందించాలి



రుణాలపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం సుధాకర్

నవతెలంగాణ-దోమకొండ

గ్రామ సంఘం మహిళలకు జీవనోపాధిపైన రుణాలను అందించాలని డీపీఎం సుధాకర్ అన్నారు. దోమకొండ మండల సమైక్య కార్యాలయంలో లఖ్‌పతి దీదీ కార్యక్రమంపై దోమకొండ, బీబీపేట్ సీసీలు, వీవోఏలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం సుధాకర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సంఘంలోని 80 మంది మహిళలను గుర్తించి జీవనోపాధి పొందడానికి వ్యవసాయం, వ్యాపారం తదితర వాటిలో భాగంగా బ్యాంకు లింకేజీ, గ్రామ సంఘం, శ్రీనిధి రుణాలను అందించి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రాజు, బాల పోచయ్య, సీసీలు, వీవోలు, గ్రామ సంఘం మహిళలు పాల్గొన్నారు.

కమిటీకి మా సమస్యలు విన్నవిస్తాం

ఎన్ఎస్ఎఫ్ కార్మికులు



మాట్లాడుతున్న కార్మికులు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు నియమించిన కమిటీ త్వరలో బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ సందర్శనకు వస్తున్నందున శుక్రవారం ఫ్యాక్టరీ కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నియమించిన కమిటీకి కార్మికుల డిమాండ్లను వినిపించాలని చర్చించారు. ఫ్యాక్టరీ లే ఆఫ్ అయినప్పటి నుంచి ఇప్పటివరకు బకాయి వేతనాలను మంజూరు చేయాలని, ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వమే నడిపించాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమావేశంలో చర్చించారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు ఉపేందర్, నాగుల రవిశంకర్‌గౌడ్, రహమత్ అలీ, బాలకృష్ణ, శ్రీనివాస్, ప్రకాష్, అనిల్‌కుమార్, కార్మికులు స్వామి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ బాలకృష్ణకు సన్మానం


ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రానికి నూతన ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన బాలకృష్ణ కు శుక్రవారం ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి తన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమస్త్రలో ఏపిఓ రాజేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష అట్టలు పంపిణీ


పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్, ఎంపీటీసీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాగిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, ఎంపీటీసీ, కలిసి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను శుక్రవారం పంపిణీ చేశారు. పరీక్షను బాగా రాసి మంచి ర్యాంకులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో వీడిసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల సరిహద్దులు చూయించండి

- ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా


ధర్నా చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

గత కొన్ని ఏళ్లుగా పచ్చల నడుకుడ, జాన్కంపేట్ గ్రామాల మధ్యగల పెద్దవాగు సరిహద్దు వివాదం చిల్కి చిలికి అధికారుల నిర్లక్ష్యం వల్ల వివాదంగా మారింది. వేల్పూర్ మండలంలోని జానకంపేట గ్రామస్తులు శుక్రవారం 200మంది తరలివచ్చి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఉన్న మంత్రి ప్రశాంత్ రెడ్డికి సైతం మొరపెట్టుకున్న సమస్యను పరిష్కరించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత డిప్యూటీ కలెక్టర్ చిత్ర మిశ్రా, ఏడి, ఆర్‌డిఓకు ఇరు గ్రామాల సరిహద్దు వివాదం పరిష్కరించమని ఈనెల 14న పంపారని మండల స్థాయి అధికారులు ఎవరు ఏడికి సహకరించకపోవడంతో ఏడి తిరిగి వెళ్లిపోయారన్నారు. మా గ్రామాన్ని ఎవరు పట్టించుకోవడం లేదని సరిహద్దు వివాదాన్ని సర్వే జరిపి సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరారు. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదని, ఫెక్సీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,, ఎంపీటీసీ గ్రామస్తులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్
- ఎంపిడిఓలకు ఘన సన్మానం


ఎంపీడీవోలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమేనని బదిలీపై ఎక్కడికి వెళ్ళినా అంకితభావం పట్టుదలతో పనిచేసే అక్కడి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల మన్ననలు పొందాలని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అన్నారు. శుక్రవారం ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై నిర్మల్ జిల్లా ముధోల్ వెళ్లిన ఎంపిడిఓ రాములు నాయక్ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఇందల్ వాయి నూతన మండలం ఏర్పడిన నాటినుండి ఎంపిడిఓగా ఉన్న రాములు నాయక్ ప్రభుత్వం ఏ పథకాన్ని అమలు చేయాలన్న ముందుండి పూర్తి చేయించడంలో సఫలీకృతులయ్యారన్నారు. మండల ప్రజలే కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంతో ఉంటూ పనులు చేయించి అభివృద్ధికి తోడ్పాటు అందించారని తెలిపారు. బదిలీపై వెళ్లిన చోట కూడా అలాగే పనులు చేయించుకుంటూ పేరు తెచ్చుకోవాలని అన్నారు. మండలంలో ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించడానికి అందరి సలహాలు సూచనలు వింటూనే అభివృద్ధికి కృషి చేశారని ఆయన మండలానికి చేసిన సేవలు అమోఘం అని అన్నారు. కామారెడ్డి జిల్లా బీక్నూర్ నుండి వచ్చిన నూతన ఎంపీడీవో అనంత రావు సిబ్బందిని, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మండలాన్ని అభివృద్ధి వైపు వెళ్ళడానికి ప్రత్యేక కృషి చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు వైస్ ఎంపీపీ భూసని అంజయ్య నూతన ఎంపీడీవో అనంతరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, ఎంపీడీవోగా ఉన్న సమయంలో రాములు నాయక్ చేసిన కృషిని వివరించారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మారెడ్డి,పిఆర్ ఎఈ కిషన్, జూనియర్ అసిస్టెంట్ విమలా బాయి, లింగం, ఐకెపి ఎపిఎం సువర్ణ, ఎంపీటీసీలు కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, మారంపల్లి సుధాకర్, తాటిపాముల శ్రీనివాస్ గుప్తా, సుదీర్, గణేష్ ,రాజు నాయక్, గడ్కోలు శ్రీనివాస్ సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు లోలం సత్యనారాయణ, తాజా మాజీ సర్పంచ్ తేలు విజయ్ కుమార్, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ రూరల్ కన్వీనర్ పాశం కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, నగేష్, భరత్, అశోక్, సువార్త, అనూష, అరుణ, సుశీల, ధర్మవరం సింగోటం యశ్వంత్ పాల్గొన్నారు.

గుంతలమయం అర్సపల్లి రైల్వే గేట్ ప్రాంతం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


గుంతలమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి దగ్గర నిత్యం సుమారుగా 50 నుండి 60 రైళ్ల రాకపోకలు కొనసాగిస్తూ ఉంటాయి. రైళ్లు వచ్చినప్పుడు గేటు పడుతుంది. అక్కడ ఈ మధ్యనే ఫ్లైఓవర్ కూడా సాంక్షన్ అయిందని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. కానీ అక్కడ గేటువద్ద పెద్ద గుంతలు ఉండడం వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు పూడ్చి ఇబ్బందులు పడకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన
- పంటలకు మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలి
- జాతీయ రహదారి-44పై రాస్తారోకో
- కార్మికుల కడుపు నింపే చట్టాలు కావాలి

సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త గ్రామీణ భారత్ బంద్ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, రాస్తారోకో చేపట్టారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని పంటలకు మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.



ఆర్మూర్ : ర్యాలీగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-విలేకరులు

ఆర్మూర్: నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్పొరేట్, మత విధానాలకు నిరసనగా ఎస్‌కే యం, కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం పట్టణంలోని అంగడి బజార్‌లో సభ నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సభకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి వెంకటేష్ అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు, సిఐటియు జిల్లా నాయకులు చంద్రకళ, ఐఎఫ్టియు అధ్యక్షులు ముత్తన్న, భీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, ఏఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. బిజెపి అధికారం చేపట్టి పది సంవత్సరాలు పూర్తయిన హామీలను తుంగలో తొక్కి రైతాంగ, కార్మికవర్గ ప్రజల సమస్యల్ని పరిష్కరించకుండా, ప్రజాసంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందనీ వారు అన్నారు. 2023లో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిందని వారు తెలిపారు. ప్రతి ఏటా రెండు కోట్ల కొలువుల మాట నీళ్ల మూటగా మారిందని అన్నారు. నల్లధనాన్ని వెలికి తీసి పేదవారి బ్యాంక్ ఖాతాల్లో 15 లక్షల జమ హామీ అమలుకు నోచుకోలేదని వారు తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను మోడీ సర్కార్ తెచ్చిందని అన్నారు. పీఎఫ్, ఇఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తుందని, 12 గంటల పని విధానం అమలకు ప్రయత్నిస్తుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8 వ కమిషన్ నియమించకుండ జాప్యం చేస్తుందని విమర్శించారు. 2016 అక్టోబర్ 26 సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మోడీ ప్రభుత్వం చెత్తబుట్టలో పడేసిందని వారు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తోందని వారు విమర్శించారు. 2014 స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంటకు ఎం ఎస్ పి.చెల్లిస్తామని హామీని బిజెపి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని వారన్నారు. రోడ్ సేఫ్టీ బిల్లు పేరుతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతీయడం దుర్మార్గమన్నారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ఆపాలని, మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతులు చేస్తున్న ఆందోళనపై మోడీ సర్కార్ భాష్పవాయువు ప్రయోగించి ఉద్యమ అణిచివేతకు కుట్ర చేయడం దుర్మార్గమని వారన్నారు. అశాస్త్రీయ భావజాలాన్ని రుద్దుతూ, హక్కుల కోసం తెగించి ఉద్యమిస్తే నిర్బంధిస్తున్నారని వారు తెలిపారు. నిరుద్యోగం, అధిక ధరలు, పేదరికం, ఆకలి, ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా, మత వైషమ్యాలు ను రెచ్చగొట్టి అధికారంకోసం ఆరాటపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న, మధ్యాహ్న భోజనం సంగం సుజాత, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ధనలక్ష్మి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు నరాటిలక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం గంగన్న, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దేవన్న, బాబురావు ఐఎఫ్టియు నాయకులు నజీర్,సొప్పరి గంగాధర్, అరుణోదయ జిల్లా కార్యదర్శి అబ్దుల్, సిఐటియు నాయకులు శంకర్, జగదాంబ ఏఐఎఫ్టియు నాయకులు పెద్దులు, టి శ్రీనివాస్ ,బి రాజు, అల్తాఫ్ పాల్గొన్నారు.

పట్టణంలోని పెర్కిట్ నేషనల్ హైవే నుండి పెర్కిట్ మీదుగా పట్టణ అంబేడ్కర్ చౌరస్తా వరకు ఆటో డ్రైవర్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పెట్టడం వలన లక్షలాది మంది ఆటో డ్రైవర్ కుటుంబాలు రోడ్డున పడ్డాయని తమను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వం రోడ్ సెఫ్టి బిల్లును రద్దు చేసి పెంచిన ఇన్సూరెన్స్ రేట్లను తగ్గించాలని ధర్నా చేశారు. కార్యక్రమంలో మౌలానా, శ్రీకాంత్, రహీం, పెరోజ్, సోమ శ్రీను, మాదరి నరేష్, లక్ష్మి నర్సయ్య రమేష్, జమున. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: మోడీ నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలవల్ల లక్షలాది పరిశ్రమలు మూతపడి, కోట్లాదిమంది బహుజన కార్మిక వర్గం రోడ్డున పడిందని రైతులు, కార్మికులు, ఉద్యోగులు కొనుగోలు శక్తిని కోల్పోతున్నారని బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు, కార్మిక దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ కు మద్దతుగా శుక్రవారం బహుజన వామపక్ష కార్మిక సంఘాల సమాఖ్య బిఎల్‌టియు జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటలకు సుభాష్ నగర్ నుండి మున్సిపల్ కార్పొరేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రదర్శన కోర్టు నుండి ఖలీల్ వాడి మీదుగా బస్టాండ్ రైల్వే స్టేషన్ పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిల్లీ చూట్టూ రైతులు ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే వారి సమస్య పరిష్కారం చేయకపోగా డ్రోన్లతో టీయర్ గ్యాస్ ద్వారా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. కార్మిక వర్గం ప్రతిఘటించకపోతే భారత రాజ్యాంగం కల్పించిన సామాజిక భద్రత, సంక్షేమం, రిజర్వేషన్లను బిజెపి కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే ప్రమాదం ఉందనిఅన్నారు. బిఎల్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ధిరాములు మాట్లాడుతూ.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న క్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం బహుజన శ్రామిక మహిళలకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడి చేసే పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని విమర్శించారు. కార్యక్రమంలో బిఎల్ టియు జిల్లా అధ్యక్షులు కె.మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బియాల్టియు నాయకులు, బిడిఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.శ్రీమాన్, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి పాల్గొన్నారు.


మాక్లూర్ : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్-సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె సందర్భంగా శుక్రవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కటారి రాములు, యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



భీంగల్‌లో..

భీంగల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి 26 వేల రూపాయల వేతనాన్ని అందించాలని సిఐటియు నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు కైరి దేవగంగు కోరారు. వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణ కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో కూర్చున్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బడా భీంగల్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవగంగు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్వాడి సెంటర్లపై చిన్న చూపు చూస్తుందని, దీంట్లో భాగంగానే గడిచిన 10 సంవత్సరాలలో అంగన్వాడి విద్యకు 60 శాతం బడ్జెట్‌ను తక్కువ చేసిందని అన్నారు. ఇలా చేయడం వల్ల అంగన్వాడీ విద్య బలహీన పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా తేరుకొని అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలన్నారు.

గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్రోబార్లు కూడా సమ్మె చేపట్టారు కారోబార్లను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని మండల అధ్యక్షుడు బాలయ్య ప్రభుత్వాలను కోరారు. ఈ సమ్మెలో అంగన్వాడి నాయకులు ప్రమీల, గంగా లక్ష్మి, యమున, కార్మికులు, కరోబార్లు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశావర్కర్లు నిరసన చేపట్టి, తహశీల్దార్లు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. మానిక్ బండారు 63వ జాతీయ రహదారి వద్ద అటో యూనియన్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా సిపిఎం మండల కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ విజయవంతం అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ఏఐటియుసి నాయకులు, ఆశావర్కర్లు, అటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి 44పై గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధరలు లేక దేశవ్యాప్తంగా అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పార్లమెంట్‌లో ఎంఎస్‌పి చట్టాన్ని తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, ఢిల్లీలో రైతులపై భాష్ప వాయువు ఉపయోగించడం సరైనది కాదని తెలిపారు. ఢిల్లీ రైతు వ్యతిరేక చట్టాల ఉద్యమంలో రైతులపై మోపిన కేసులను ఎత్తివేయాలని తెలిపారు. ఆటో డ్రైవర్ల ను నూతనంగా ఆర్టీసి బస్సుల్లో 30శాతం నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి , జిల్లా సహాయ కార్యదర్శి దేవస్వామి, కృష్ణాగౌడ్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయినాథ్, పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ , ప్రజాసంఘాల నాయకులు నగేష్, రవీందర్,మణికంత, ఆటో కార్మికులు కలిం,జవిద్, సాయన్న రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కరోన సమయంలో కార్మికుల కాళ్ళ కడిగారని కానీ కార్మికులకు కావాల్సింది కడుపు నింపే చట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంపీడీవో నాగనాథ్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను జీవో నెంబర్ 51 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు దేవేందర్ సింగ్ మాట్లాడుతూ.. రైతులకు ఎంఎస్‌పి ధరలను కేటాయించాలని, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు మేకల ఆంజనేయులు, రాజు, పోసాని, మాణిక్యం, నర్సయ్య సిపిఎం నాయకులు వసంత్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని ఏకేఎంఎస్ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు నిమ్మల భూమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు గులాం, హుస్సేన్, కృష్ణ, రాములు, రేకులపల్లి గంగారం, దేవదాస్, జుంగల గంగారాం, గోపి గుండ్ల, దాసు, పీవైఎల్ మండల అధ్యక్షుడు మల్కి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శి కదం రాజు తదితరులు పాల్గొని మంచిప్ప గ్రామంలో దుకాణాలు బంద్ చేయించారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. కార్మిక వర్గాలు దేశవ్యాప్త సమ్మె, ఢిల్లీలో రైతాంగానికి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, కనీస మద్దతు ధర చట్టం చేయాలని ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి సారధ్యం వహిస్తున్న నరేంద్ర మోడీ ప్రజా సమస్యలను, దేశాభివృద్ధిని పూర్తిగా మరిచిపోయి కొంతమంది కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ అన్నం పెడుతున్న రైతాంగం, వ్యవసాయ కార్మికుల చేతులు నరికే కుట్ర చేస్తున్నారని తెలిపారు. దేశానికి సంపద సృష్టించే కార్మిక వర్గాన్ని కార్పొరేట్ సంస్థలకు, పరిశ్రమల యజమానులకు బానిసలుగా మార్చేందుకు 44 కార్మిక చట్టాలను ఎత్తివేసి నాలుగు కోడ్ లుగా మార్చిన నీచపు చరిత్ర నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. వెంటనే ఈ విధానాలను వెనక్కు తీసుకోకపోతే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు. 750 మంది పైగా రైతులు ప్రాణాలర్పించి ప్రధాని చేత రైతు వ్యతిరేక చట్టాలని రద్దు చేయించుకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఉద్యమాన్ని అణచివేసే కుట్ర బీజేపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. ధర్నాకోసం వెళ్తున్న రైతాంగాన్ని రాకుండా బారికేడ్లను పెడుతూ రోడ్డు మీద మేకులు కొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకుంటే రెండు సార్లు గెలిపించిన ఈ ప్రజలే నిన్ను, నీ ప్రభుత్వాన్ని మట్టికరిపిస్తారని హెచ్చరించారు.


మోపాల్‌లో.,


డిచ్‌పల్లిలో..


నవీపేట్: నినాదాలు చేస్తున్న కార్మికులు

మహేష్‌కుమార్‌గౌడ్‌కు, షబ్బీర్ అలీకి సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/కంఠేశ్వర్

నూతనంగా ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీగా ఎన్నికై మొట్టమొదటిసారి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు ఇందల్ వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద, డిచ్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు బోనాలతో, డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి ముదిరాజ్, డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండల అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, మాజీ ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, తదితరులు సన్మానించి స్వాగతం పలికారు.

కంఠేశ్వర్: షబ్బీర్ అలీ రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సలహాదారులుగా, మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా నిజామాబాద్ పట్టణానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బోర్గాం నుండి వందలాధి కారుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ మంత్రి మాండవ వెంకటేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు జిల్లా అధ్యక్షులు పట్టణ అధ్యక్షుడు కాంగ్రెస్ మున్నూరు కాపు సంఘం లో పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారికి కార్పొరేటర్ టికెట్టు ఇచ్చి గెలిపించుకుని నిజామాబాద్ కార్పొరేషన్ కైవసం చేసుకుంటామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.



కంఠేశ్వర్ : మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

మొక్కలు దగ్ధం

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని కల్వరాల్ శివారులో 44వ జాతీయ రహదారికి ఇరుపక్కల అటవీశాఖ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మొక్కలు కాలిపోవడంతో రోడ్డువెంబడి వెళ్లే ప్రయాణికుల కండ్లలోకి పొగవెళ్లడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ఈ సమాచారం అటవీశాఖ అధికారులకు అందలేదని తెలుస్తోంది. వేసవి ప్రారంభ దశలోనే ఇలా ఉంటే మండుటెండల్లో అటవీలో ఎన్ని అగ్ని ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యంపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పిజెఆర్ "ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.అంజయ్య (తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్) హాజరై విద్యార్థిని, విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్ఫూర్తి డిగ్రీ కళాశాల చైర్మన్ కె.గురువేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో ఎదురయ్యే సమస్యలను జీవన నైపుణ్యాలతో పరిష్కరించుకుంటే తన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్‌గౌడ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక సంఘాలు

- కార్మికులతో కలిసి భారీ ర్యాలీ
- దేశవ్యాప్త సమ్మె విజయవంతం

నవతెలంగాణ-విలేకరుల బృందం

బిజెపి ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త బంద్ బోధన్‌లో విజయవంతమైంది. ఈ సందర్భంగా వామపక్ష కార్మిక సంఘాలు, అసంఘటిత కార్మికులు బంద్‌లో పాల్గొన్నారు.

బోధన్ : పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు ఐ.ఎఫ్.టి.యూ, సిఐటియు, నాయకులు బి.మల్లేష్, జె.శంకర్‌గౌడ్, పి.వరదయ్య, ఏశాల గంగాధర్, డి.పోశెట్టి, పిఓడబ్ల్యు పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తి అయినా రైతుల, కార్మికుల, ప్రజల సమస్యలు పరిష్కరించలేదని మండిపడ్డారు. అనేక మోసపూరిత వాగ్దానాలు ఇచ్చిన ఒరిగిందేమీ లేదని తీవ్రంగా దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీఇచ్చారని కానీ బిజెపి ప్రభుత్వ విధానాల మూలంగా అనేక పరిశ్రమలు మూతబడి లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమ పథకాలను రద్దు చేశారని, మరోవైపు కార్పొరేట్లకు లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారన్నారు. అంగన్వాడీ స్కీం వర్కర్లకు కనీస వేతనాలను పెంచడం లేదన్నారు. కనీసం కనీస వేతనాల సవరణలు చేయడం లేదని దేశంలో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కంపెనీలకు అనుకూలంగా మార్చారని మండిపడ్డారు. సమానపనికి సమానవేతనం అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా ఖాతరు చేయడం లేదని, రైతాంగం పండించిన పంటలకు మినిమం సపోర్టు ప్రైస్ హామీని అమలు చేయడం లేదని ఇలాంటి కార్మిక ప్రజా రైతాంగ వ్యతిరేక విధానాలను మానుకోకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కేంద్ర బిజెపికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో (ఏఐపికెఎస్) అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షులు పడాల శంకర్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి. సీతారాం, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు బీ పాషా బేగం, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రెహానా బేగం, ఐఎఫ్‌టియూ నాయకులు ఇర్షత్ పాషా, కాజా, సిఐటియు నాయకులు జంగం గంగాధర్, సాగర్, ఐఎఫ్‌టియు నాయకులు సాయిలు, సురేష్, బీడీ కార్మికులు అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం వెంటనే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం 2020 తీసుకువచ్చి విద్యా ప్రవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేస్తుందని ధ్వజమెత్తారు. యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి లేకుండా ప్రభుత్వం ఆజమాయిషీ చెలాయించడం కోసం ప్రయత్నించడం సరైంది కాదన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్టీ సిలబస్ మార్పులను ఆపాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్స్ ఫెలోషిప్స్‌లలో కోత విధించడం ఏమాత్రం సమంజసం కాదని వారి పేర్కొన్నారు. అలాగే యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్‌కు సరిపడా నిధులు కేటాయించాలని, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు విద్యా రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే దేశానికి వెన్నెముకైన రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటానని ఇచ్చిన మాటను మోడీ నిలబెట్టుకోవాలని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు రాజన్న, అంజలి, సాయికుమార్, మోసిన్, ఆకాష్, సాయినాథ్, ప్రకాష్ పాల్గొన్నారు.

రైతుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

కేంద్ర ప్రభుత్వం రైతులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బోధన్ నియోజకవర్గంలో బోధన్ పట్టణంలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు నిర్వహించి ఆర్డిఓ రాజాగౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, పవన్, అబ్బయ్య శంకర్, నాగమణి, రూప, కె.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మద్నూర్ : మండల కేంద్రంలో బహుజన వామపక్ష కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఐసిటియు, బిఎల్‌టియు, టిఎఫ్‌టియు, బిఎఫ్‌టియు, టిబిసిటిసి తదితర బహుజన వామపక్ష సంఘాలకు చెందిన నాయకులు కర్రేవార్ నాగేష్, అవర్‌వార్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి విటల్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం సర్వేయర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విటల్‌గౌడ్ మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర ప్రభుత్వం 10 సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ధర్నాకు దిగితే రైతులపై లాఠీచార్జి చేసి, దేశద్రోహులుగా చిత్రీకరిస్తుందని, రైతుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కామారెడ్డి : రైతు, కార్మిక దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు మద్దతుగా బహుజన వామపక్ష కార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిఎల్‌టియు, ఏఐసిటియు, ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళ సంఘం, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ కార్యాలయం బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలు పట్టు కొమ్మల్లాంటివి

- ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-పిట్లం

యువతకు క్రీడలు పట్టుకొమ్మలాంటివని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం రాత్రి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని వివేకానంద విద్యానికేతన్ ఆధ్వర్యంలో 15 రోజులపాటు నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని ఆయన కొనియాడారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం లభిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని ఓడినవారు కృంగిపోవద్దని, రానున్న రోజులు తమవేనని భావించి ముందుకెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం కబడ్డీ టోర్నమెంట్ విన్నర్ జగదాంబ వారియర్స్ పిట్లం, రన్నర్‌గా గుడితండా గెలుపొందగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రోఫీ కప్పులతోపాటు రూ.22,222, రూ.11,111 నగదును అందజేశారు. కాగా టోర్నమెంట్ నిర్వాహకులు ఏనుగండ్ల శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంటు మాజీ ఎంపీ సురేష్ శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

- ఉచితంగా మందులు పంపిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఆర్‌బిఎస్‌కే ఆధ్వర్యంలో సీజనల్ వచ్చే దగ్గు, జలుబుతో బాధపడకుండా శుక్రవారం ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని లేకపోతే చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదముందని విద్యార్థులకు హెచ్చరించారు. భోజన సమయంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు, గుడ్లు, మాంసకృత్తులతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థులను రక్త పరీక్ష ద్వారా గుర్తించి ఉచితంగా ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు. అలాగే తీసుకోవాల్సిన పోషకాహారం గురించి తెలియజేశారు. రక్తహీనత వల్ల కలిగే నష్టం గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కే వైద్యులు సంజయ్ కుమార్, సంగీత, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జోత్స్న, ఫార్మాసిస్ట్ రవితేజ, సునీత, స్టాఫ్‌నర్స్ సంయుక్త, అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను ఏఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి పరిధిలోని వరి పంటలను పరిశీలించి మోగి పురుగు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. పి.యం.కిసాన్ కోసం ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. బ్యాంకు ఖాతాలకు అధార్‌కార్డు లింకు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని బట్టు తండాలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నరసగౌడ్, గ్రామస్తులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.10 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ లచ్చిరాం, కాంగ్రెస్ నాయకులు విట్టల్ నాయక్, బోజు నాయక్, రాజునాయక్, రాథోడ్ రవినాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని పరిశీలించిన మండల పరిశీలకులు



సమావేశమైన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థిని విద్యార్థుల ప్రగతిని మండల ఉపాధ్యాయ బృందం పరిశీలించింది. శెట్పల్లి ఉన్నత పాఠశాలకు పదవ తరగతి విద్యార్థుల ప్రతి నెల జరిగే పరీక్షల ఆధారంగా విద్యార్థుల ప్రగతి విద్యార్థులను నైపుణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో పరిశీలకులు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలచారి, వసుధ, సిఆర్పి రాజు, ఉపాధ్యాయుల బృందం ఉన్నారు.

పీఎం కిసాన్‌కు రైతులు ఈ కేవైసీ చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్

నవతెలంగాణ-రామారెడ్డి

పీఎం కిసాన్‌కు రైతులు ఈ కేవైసీ, ఆధార్ సీడింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కన్నాపూర్ తండాలో రైతులకు అవగాహన కల్పించారు. మద్దికుంటలో భారతీయ కిసాన్ సాంగ్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయం మెలకువలు, తదితర అంశాలపై ఏఈఓ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, గాయత్రి, ప్రణతి, భారతీయ కిసాన్ సంగ్ మండలాధ్యక్షులు కె.రాజశేఖర్, రైతులు బండి ప్రవీణ్, ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలించిన ఎంపీడీవో శంకర్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి, కిసాన్‌తండా గ్రామాలలో నర్సరీలను ఎంపీడీవో శంకర్ పరిశీలించారు. ప్రతి గ్రామంలో నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన క్షేత్రస్థాయిలో సూచించారు. నర్సరీల పెంపకంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతిరోజు నర్సరీలకు నీటిని అందించే చర్యలను చేపట్టాలన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

32 పంచాయతీలు..
20 మంది డీలర్లు

- మిగతా చోట్ల అందరూ ఇంచార్జిలే..
- దీంతో సమయానికి అందని రేషన్ బియ్యం
- పేదలకు తీవ్ర ఇబ్బందులు



నవతెలంగాణ-వర్ని

వర్ని ఉమ్మడి మండలంలో రేషన్ డీలర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు డీలర్లకు పూర్తిస్థాయి గ్రామం ఉండటం.. మొత్తానికే డీలర్ లేని గ్రామాలకు వారు ఇంచార్జీగా కొనసాగడంతో సరైన సమయానికి బియ్యాన్ని ఇవ్వలేకపోతున్నారు. తద్వారా రేషన్ బియ్యంపైనే ఆధారపడిన పేదలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు.

వర్ని ఉమ్మడి మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలుండగా.. రేషన్ డీలర్లు మాత్రం 20 మంది మాత్రమే ఉన్నారు. మిగతా గ్రామాలకు 12 మంది ఇంచార్జి డీలర్లే కొనసాగు తున్నారు. దీంతో చిన్న గ్రామపంచాయతీలో అనుకున్న సమయానికి రేషన్ బియ్యం లబ్దిదా రులకు అందక కొట్టుమిట్టాడుతున్నారు. ఇన్చార్జిలు మాత్రం తమకు రెగ్యులర్‌గా ఉన్న జీపీలల్లోనే ముందస్తు రేషన్ బియ్యం అందజేసి తదుపరి సమ యముంటేనే ఇన్చార్జి గ్రామాలకు రేషన్ బియ్యాన్ని అందిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఇన్చార్జి డీలర్లు ఉన్న గ్రామాల్లో రేషన్ లబ్దిదారులు మాత్రం రేషన్ బియ్యం కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. మాజీ స్పీకర్, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి గతంలో లబ్దిదారుల చిన్న పంచాయతీ ప్రజల కోరిక మేరకు డీలర్లు లేని గ్రామాలలో ఇన్చార్జిలుగా ఉన్నవారు సబ్ సెంటర్‌లను పెట్టి అనుకూల సమయంలో ప్రతినెల ఐదు నుంచి 8వ తేదీ వరకు పేద ప్రజలకు రేషన్ బియ్యం అందజేయాలని ఆయన ఆదేశించారు. అందుకు కొన్ని గ్రామాలలో రాజపేట్, గోకుల్‌దాస్‌తండా, చింతల్‌పేట్ తాండ గ్రామాల్లో సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి రేషన్ బియ్యాన్ని అందజేశారు. మళ్లీ యధావిధిగాని రేషన్ డీలర్లు తమకు ఇబ్బందిలున్నాయంటూ తమకు అనుకూల సమయంలో వచ్చి బియ్యం ఇస్తామని లబ్దిదారులకు చరవని ద్వారా తెలుపుతున్నట్లు ఆరోపణలు. దీంతో రేషన్ లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రెగ్యులర్ ఎప్పుడు వస్తారు..?

ఉమ్మడి మండలాల్లో కొన్ని గ్రామాలలో వేరే వ్యక్తుల పేర్లపై రేషన్ షాపులు ఉన్న స్థానికంగా ఉండి డీలర్‌గా కొనసాగుతున్న కొందరు వ్యక్తులు వారి పేర్ల పైన ఉన్న షాపులను కూడా వీరు నడుపుతున్నారన్నది ఆరోపణలు వస్తున్నాయి. 32 గ్రామ పంచాయతీలకు మరో సుమారు 12 మంది రేషన్ డీలర్లను నియామకం చేపడితే రేషన్ బియ్యంపై ఆధారపడి జీవించే పేదవారికి ప్రతినెలా సమయానికి బియ్యం అందుతాయని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా పర్మినెంట్ రేషన్ డీలర్లను నియమించాలని పలువురు కోరుతున్నారు.

బినామీ రేషన్ డీలర్లను తొలగించాలి



గ్రామాల్లో రెండు రేషన్ షాపులు ఉంటే ఒకే వ్యక్తి రెండు షాపులు నడుపుతున్నాడు. ఒక వ్యక్తికి రెండు రేషన్ షాపుల లైసెన్స్‌లు ఇవ్వడం కరెక్ట్ కాదు. చదువుకున్న నిరుద్యోగ యువత చాలామంది ఉన్నారు. నిరుద్యోగ యువతకు రేషన్ డీలర్ లైసెన్స్ ఇస్తే ఉపాధి దొరుకుతుంది. ఉమ్మడి మండలాలలో సుమారు 15 నుంచి 18 గ్రామాలలో రేషన్ దుకాణాలు ఇన్చార్జిలతోనే కొనసాగుతున్నాయి. ప్రజలకు దీనితో సమయానికి రేషన్ బియ్యం అందటం లేదు. డీలర్ లేని గ్రామాలలో స్థానిక గ్రామ యువతకు అవకాశం కల్పిస్తే డీలర్ దుకాణాలు నడుపుకొని ఉపాధి పొందుతారు. ప్రస్తుతం ఒక్కొక్క డీలర్‌కు రెండు నుంచి మూడు గ్రామాలు ఇన్చార్జిల్ గా ఉన్నాయి. దీంతో ఆ గ్రామాల రేషన్ దారులు బియ్యం సమయానికి రావటం లేదు. పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్ల నియామకం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్

పోసానిపేట ఆలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



కుటుంబ సభ్యులతో అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-రామారెడ్డి

మండ లంలోని పోసానిపేట్ శ్రీ రాజరాజేశ్వర గుడిగంటలు ఆలయాన్ని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ దంపతులు శుక్రవారం ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారికి శాలువాతో సన్మానించి, స్వామి వారి జ్ఞాపక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి పోచయ్య, వీడీసి ఉపాధ్యక్షులు గాండ్ల ప్రవీణ్, పూజారి మురళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలో శుక్రవారం ప్రత్యేకంగా మహిళల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గాంధారి జ్యోతి హాస్పిటల్ వైద్యురాలు రాథోడ్ జ్యోతి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. యాచారం మాజీ ఎంపిటిసి సురేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయగా.. స్థానిక ఎంపీపీ అనసూయ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా వివిధ రకాల వ్యాధులతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వారికి వైద్య సేవలు అందాలనే ఉద్దేశ్యంతో సురేందర్ కోరడంతో వెంటనే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. శిబిరంలో దాదాపు 100 మంది మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అందుకు సంబంధించిన మందులు కూడా ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పసుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



ప్రార్థన సమయంలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మాగి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్యాధికారి దేవిసింగ్ తనిఖీ చేశారు. అదేవిధంగా పాఠశాలలో పిల్లల సామర్థ్యాలను ఉపాధ్యాయుల సమయపాలనను, మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయులందరూ కూడా సమయపాలన పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని మండల తహసీల్దార్‌గా కె.మోతీసింగ్



నవతెలంగాణ-వర్ని

వర్ని తహసీల్దార్‌గా కె.మోతిసింగ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్చాలు అందజేశారు. కొనసాగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలు బహుకరణ

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని హంగర్గాఫారం గ్రామపంచాయతీలో హంగర్గా ఫారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దనసరి సీతక్క చిత్రపటాలను శుక్రవారం అందజేశారు.

అయోధ్య సేవకు యువకులు

నవతెలంగాణ-మద్నూర్

అయోధ్యలో ఈ నెల 20 నుంచి మార్చ్ 2వ తేదీ వరకు భాగ్యనగర్ అయ్యప్ప సేవ సమితి వారు నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో సేవ కోసం మద్నూర్ నుంచి పది మంది యువకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు.

మాచారెడ్డి ఎంపీడీవోగా గోపి బాబు

నవతెలంగాణ-మాచారెడ్డి



మాచారెడ్డి మండల ఎంపీడీవోగా గోపి బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు మాచారెడ్డి ఎంపీడీవోగా పని చేసిన బాలకృష్ణ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గోపి బాబును ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

ఉపాధ్యాయుని జ్ఞాపకార్థం మిత్రబృందం సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-మద్నూర్



మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు దెబ్బడువార్ పవన్ కుమార్ జ్ఞాపకార్థం ఆయన తోటి మిత్రుల బృందం శుక్రవారం మండల కేంద్రంలోని గోశాలను సందర్శించి ఆవులకు దాన అందజేశారు. గోశాల ఆవుల సంరక్షణ కోసం స్వర్గీయ ఉపాధ్యాయుని మిత్రబృందం నగదును గోశాల నిర్వాహకులు చాట్‌లో హనుమాన్లుకు అందజేశారు. కార్యక్రమంలో రఘు, బాలు, సంతోష్, గంగాధర్, తాజా మాజీ ఉపసర్పంచ్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు



ఆర్మూర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..



నిజామాబాద్‌లో కార్మికులతో కలిసి ర్యాలీ, మహాప్రదర్శన చేపట్టిన కార్మిక సంఘాల నాయకులు



కామారెడ్డిలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి నినాదాలు చేస్తున్న కార్మికులు



కామారెడ్డి : డప్పు చప్పుల్లు, కార్మికుల నినాదాలతో ర్యాలీ చేపట్టిన నాయకులు..



కార్మిక సంఘాల నాయకుల అభివాదం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్



నిజామాబాద్‌లో సమ్మెలో భాగంగా బహిరంగ సభకు హాజరైన పలు రంగాల కార్మికులు



కామారెడ్డిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కోటగిరిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా..



కంఠేశ్వర్ : నిజామాబాద్‌లో బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో



సీఐటీయూ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో



మద్నూర్‌లో



కామారెడ్డిలో..



బోధన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఉద్యోగుల హక్కుల సాధనకుఉద్యమిద్దాం : టీఎన్‌జీవోస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వీడాలని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరిద్ధరించాలని, ఇన్‌కం ట్యాక్స్ పరిమితిని 10 లక్షలకు పెంచాలని, ఔట్ సోర్సింగ్ , కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయుట, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు కలిసికట్టుగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతికుంట శేఖర్, జిల్లా కార్యదర్శి పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.